క్లుప్తంగా

క్రీడా సామగ్రి వితరణ



జక్రాన్‌పల్లి: తొర్లికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు విద్యార్థులకు శుక్రవారం క్రీడా సామగ్రిని వితరణ చేశారు. దాతలు తొర్లికొండ వాస్తవ్యులు జిల్లా బేస్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు మధుసూధన్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లేష్‌గౌడ్‌లు కలిసి రూ.10వేల విలువ గల క్రీడా సామగ్రిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఎంఈవో శ్రీనివాస్ చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు. అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ గంగాజమున, మాజీ ఉపసర్పంచ్ భూమేష్, ఉపాధ్యాయులున్నారు.

కూలి డబ్బులను వెంటనే చెల్లించాలి

సిరికొండ: ఉపాధి హామీ కూలీలకు రావాల్సిన కూలి డబ్బులను వెంటనే చెల్లించాలని ఏఐకేఎంఎస్ మండలాధ్యక్షుడు నిమ్మల భూమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గడ్కోల్‌లో శుక్రవారం నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు నెలలుగా చేసిన పనులకు సంబంధించిన డబ్బులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. రాములు, కృష్ణ, ఎల్లయ్య, సంజీవ్, సాయన్న, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర సహకార యూనియన్ చైర్మన్‌కు సన్మానం



ఖలీల్‌వాడి: తెలంగాణ సహకార యూనియన్ సంస్థ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన మానాలమోహన్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో శుక్రవారం నగర కాంగ్రెస్ అధ్యక్షులు కేశ వేణు, నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..డీసీసీ అధ్యక్షుడిగా పని చేస్తూ, పార్టీ గెలుపునకు కృషి చేసిన మానాల మోహన్ రెడ్డికి పదవి రావడం సంతోషదాయకమన్నారు. శుభాకాంక్షలు తెలిపారు. సహకార యూనియన్‌ను బలోపేతంకు కృషి చేయాలని కోరారు. కొండపాక రాజేష్, సుదీప్ రెడ్డి పాల్గొన్నారు.

అంగన్‌వాడి ఉద్యోగులపై నిర్లక్ష్యం తగదు

ఖలీల్‌వాడి: అంగన్‌వాడి ఉద్యోగుల సమస్యలపై నిర్లక్ష్యం తగదని అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు రమేష్ బాబు పేర్కొన్నారు. అంగన్‌వాడీ ఉద్యోగుల దీక్షలకు సంఘీభావం తెలిపి మాట్లాడారు. ప్రభుత్వం వెంటనే రిటైర్డ్ అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని, లేని యెడల ఆందోళనను ఉధృతం చేయాల్సి వస్తుందని, దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. రిటైర్డ్ అంగన్‌వాడీ ఉద్యోగులు కళావతి, సావిత్రి, లక్ష్మి, జరీనా పాల్గొన్నారు.

ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

నిజామాబాద్‌అర్బన్: ఉపకార వేతనాలు, ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు తక్షణమే విడుదల చేయాలని నగరంలోని ధర్నా చౌక్ వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన తెలిపి అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్‌కి వినతి పత్రం అందజేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాచకొండ విఘ్నేష్ మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి దీపిక, జిల్లా నాయకులు విశాల్, సతీష్, రాజు, అజాద్, తదితర నాయకులు పాల్గొన్నారు.

ప్రజాపాలన సేవా కేంద్రాల ఏర్పాటు

- గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాల కోసం..
- ఆరు జోన్ కార్యాలయాల్లో సేవలు
- ఉదయం 9.30గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు..
- దరఖాస్తులు స్వీకరించనున్న అధికారులు



నిజామాబాద్‌నాగారం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొవచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడానికి ప్రజాపాలన సేవా కేంద్రాలను ఏర్పాటు చేస్తుంది. మున్సిపాలిటీ పరిధిలో ప్రజాపాలన సేవా కేంద్రాలు ప్రజల కోసం అందుబాటులోకి రానున్నాయి. ప్రతినిత్యం ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నగరంలోని ఆయా జోన్ కార్యాలయాల్లో ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ మంద మకరందు ఆదేశాలు జారీ చేశారు.

రెండు పథకాల్లో అప్‌డేట్ కోసం..

నిజామాబాద్‌నగరంలో మహాలక్ష్మి, గృహజ్యోతి పథకంలో పేర్లు, చిరునామా తదితరాల ఎడిట్ చేసుకోవడానికి అవకాశం కల్పించారు. అలాగే రేషన్ కార్డు ఉండి పథకాల అందని వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పిస్తున్నారు. 200 యూనిట్ల లోపు విద్యుత్ కాల్చే వినియోగదారులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

> **సద్వినియోగం చేసుకోవాలి**
>
> అర్హులైన నగర ప్రజలు ప్రజా పాలన సేవా కేంద్రాల్లో తమ సమస్యలను నివృత్తి చేసుకోవాలి. సంక్షేమ పథకాలు రాని వారు ఉంటే దరఖాస్తు చేసుకోని లబ్ధి పొందాలి. ఆయా కేంద్రాల్లో ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు అందుబాటులో ఉంటారు.
>
> –మంద మకరందు, మున్సిపల్ కమిషనర్

దరఖాస్తు చేసుకునే ప్రాంతాలు

నాందేవాడ వాటర్ ట్యాంక్ (సాయి నరేంద్ర)	86865 74773
గోల్‌హనుమాన్ వాటర్ ట్యాంక్ (సుస్మిత)	80967 81186
బడాబజార్ వాటర్ ట్యాంక్ (నాగేష్)	99121 37746
కంఠేశ్వర్ వాటర్ ట్యాంక్ (ఎస్‌వీఎస్ సతీష్)	91105 15906
అర్సపల్లి వాటర్ ట్యాంక్ (ఖైఫ్)	79938 43572



నేటి చిత్రం..

ముబారక్‌నగర్‌లో పిచ్చిమొక్కలతో నిండిపోయిన డ్రెయినేజీ

అస్తవ్యస్తంగా డ్రెయినేజీ..

నగరంలోని మున్సిపల్ విలీన గ్రామాల్లో కనీస సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముబారక్‌నగర్‌లో డ్రైనేజీ అస్తవ్యస్తంగా ఉండడంతో పాటు పిచ్చిమొక్కలు మొలిచి దోమలకు నిలయంగా మారుతున్నాయన్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి డ్రెయినేజీని శుభ్రం చేయాలని, సీసీ డ్రెయినేజీని నిర్మించాలని కాలనీ వాసులు కోరుతున్నారు. – సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

నిధుల కేటాయింపులో వివక్ష



బీజేఎల్పీ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, ఇతర ఎమ్మెల్యేలు

- కాంగ్రెస్ 420 హామీలపై అసెంబ్లీలో ప్రశ్నిస్తాం
- అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

సుభాష్‌నగర్: బీజేపీ ఎమ్మెల్యే నియోజకవర్గాల్లో అభివృద్ధికి నిధుల కేటాయింపుల్లో వివక్ష చూపుతున్నారని, ఈ విషయమై అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వాన్ని నిలదీస్తామని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పేర్కొన్నారు. ఈమేరకు శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ సచివాలయంలో బీజేఎల్పీ సమావేశం ఫ్లోర్ లీడర్ ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అధ్యక్షతన, సీనియర్ ఎమ్మెల్యే రాజాసింగ్ ఆధ్వర్యంలో పార్టీ ఎమ్మెల్యేలు సమావేశమయ్యారు. సమావేశం అనంతరం ధన్‌పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ సమావేశాలు ఈనెల 24 నుంచి జరగనున్నాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీల అమలుపై కాలయాపన చేస్తోందని, ఈ విషయమై ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. జాబ్ క్యాలెండర్ ద్వారా నియామకాలు చేపడతానని ప్రకటించిన ప్రభుత్వం.. ఉద్యోగాల భర్తీపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. రూ.2లక్షల రుణ మాఫీ, ఎకరానికి రూ.15వేల రైతు భరోసా, కౌలు రైతులకు రూ.15వేల ఆర్థిక సాయం, వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12 వేలు, వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా, తదితర పథకాలపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని ఎండగడుతామన్నారు. రాష్ట్రంలో ప్రశ్నించే వారిపై నిర్బంధాలు, అక్రమ కేసులు, గాడి తప్పిన పోలీస్ వ్యవస్థ వంటి అంశాలు, ప్రజా సమస్యలపై అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని చర్చించామన్నారు.

విద్యార్థులు దంత సంరక్షణపై శ్రద్ధ వహించాలి



మిట్టాపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో వైద్యపరీక్షలు చేస్తున్న సిబ్బంది



రెయిన్‌బో పాఠశాలలో..

డిచ్‌పల్లి: మండలంలోని మిట్టాపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిజామాబాద్‌కు చెందిన డాక్టర్ శ్రీనునాయక్ డెంటల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో సుమారు 100 మంది విద్యార్థులకు ఉచిత దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. దంత సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. హెచ్ఎం సుశీల్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

బాపూజీ ఆస్పత్రి ఆధ్వర్యంలో..

నిజామాబాద్‌రూరల్: నగరంలోని మహాలక్ష్మినగర్‌లో గల రెయిన్‌బో పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు ప్రముఖ దంతవైద్య నిపుణులు డాక్టర్ బలరాం జాదవ్ ఆధ్వర్యంలో బాపూజీ ఆస్పత్రి సౌజన్యంతో వైద్య శిబిరం నిర్వహించారు. దంత సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించి వైద్య పరీక్షలు చేశారు. కరెస్పాండెంట్ శ్రీధర్, ప్రిన్సిపాల్ కీర్తి, తదితరులు పాల్గొన్నారు.

యువజన కాంగ్రెస్‌తోనే రాజకీయ భవిషత్తు



ఖలీల్‌వాడి: యువజన కాంగ్రెస్ ఎన్నికలలో యువకులు పోటీ చేయాలని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు విక్కీ యాదవ్ కోరారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ భవన్‌లో ఆయన మాట్లాడారు. యువజన కాంగ్రెస్ ఎన్నికల నోటిఫికేషన్ విడులైన సందర్భంగా ఎన్నికల్ అధికారి ప్రశాంత్ జిల్లాకి విచ్చేసి ఎన్నికలపై అవగాహన కల్పించారని చెప్పారు. యువజన కాంగ్రెస్‌తోనే రాజకీయాలలో రాణించే అవకాశం ఉంటుందన్నారు. నాయకులను ఉత్పత్తి చేసే ఒక కర్మాగారం యువజన కాంగ్రెస్ అని వ్యాఖ్యానించారు. మండల, అసెంబ్లీ నియోజకవర్గం, జిల్లా, రాష్ట్ర స్థాయిలో పోటీ చేసే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉపాధ్యక్షుడు నవాజ్, రాష్ట్ర నాయకులు ముద్దసీర్, అదనాన్, మెయిన్, శుభం, వినోద్, సాయి కుమార్ పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి జిల్లా నాయకులు



సుభాష్‌నగర్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి కిషన్‌రెడ్డి అధ్యక్షతన శంషాబాద్‌లోని మల్లిక కన్వెన్షన్‌లో జరిగిన పార్టీ రాష్ట్ర కార్యవర్గ విస్తృత స్థాయి సమావేశానికి జిల్లా నాయకులు శుక్రవారం హాజరయ్యారు. ముఖ్యఅతిథిగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ విచ్చేసి.. భవిష్యత్‌లో పార్టీ చేపట్టే కార్యక్రమాలు, రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు, అమలు, ఇతరత్ర అంశాలపై దిశానిర్దేశం చేశారు. సమావేశంలో ఎంపీ అర్వింద్ ధర్మపురి, ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ, పైడి రాకేష్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి, రాష్ట్ర కార్యవర్గసభ్యులు, జిల్లా ప్రధాన కార్యదర్శులు, అసెంబ్లీ కన్వీనర్లు, కార్పొరేటర్లు ఉన్నారు.

ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్‌తో భేటీ



నిజామాబాద్‌నాగారం: జిల్లాకు విచ్చేసిన ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కాల్వ సుజాతను శుక్రవారం ఆర్యవైశ్య మహాసభ జిల్లా ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా అధ్యక్షుడు మోటూరి మురళి గుప్తా నేతృత్వంలో ప్రతినిధులు కాల్వ సుజాతకు పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. అధ్యక్షుడు మోటూరి మురళి గుప్తా మాట్లాడుతూ.. వైశ్య కార్పొరేషన్ ద్వారా జిల్లాకు అత్యంత ప్రాధాన్యతను ఇవ్వాలన్నారు. వైశ్యుల అభ్యున్నతికి సంపూర్ణ సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు మహంకాళి విజయ్ కుమార్ గుప్తా, మర ప్రభు గుప్తా, ఇతర వైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

'పరిసరాల అపరిశుభ్రత వల్లే సీజనల్ వ్యాధులు'



స్థానికులతో మాట్లాడుతున్న మేయర్ నీతూకిరణ్, మున్సిపల్ కమిషనర్ మకరందు

నిజామాబాద్‌నాగారం: పరిసరాల అపరిశుభ్రత వల్లే సీజనల్ వ్యాధులు వ్యాపిస్తున్నాయని నగర్ మేయర్ దండు నీతూకిరణ్, కమిషనర్ మకరందు అన్నారు. శుక్రవారం నగరంలోని 14వ డివిజన్ డెయిరీ ఫామ్ ప్రాంతంలో ఇటీవల డెంగీ వ్యాధి బారిన పడిన కుటుంబాన్ని మేయర్, డిప్యూటీ మేయర్, మున్సిపల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్ పరామర్శించారు. అలాగే ఆ ప్రాంతంలో పర్యటించి, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇంట్లో, ఇంటి చుట్టు పక్కల నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. ఎవరైనా వ్యాధుల బారిన పడినట్లయితే స్థానిక ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేసి మందులు వేసుకోవాలన్నారు. కార్యక్రమములో డిప్యూటీ మేయర్ ఇద్రిస్ ఖాన్, డిప్యూటీ కమిషనర్ రాజేంద్ర కుమార్, అర్సపల్లి ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి సామ్రాట్, తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో పురుగులు



పురుగులను చూపుతున్న విద్యార్థులు

నిజామాబాద్‌అర్బన్: నగరంలోని కోటగల్లి బాలికల పాఠశాలలో శుక్రవారం మధ్యాహ్న భోజనంలోని పురుగులు వచ్చాయి. విద్యార్థులు భోజనం చేసే ముందు అన్నంలో పురుగులు కనబడడంతో టీచర్ల దృష్టికి తీసుకెళ్లారు. ఏజెన్సీ నిర్వాహకులను టీచర్లు ప్రశ్నించగా మాకు మీరు ఇచ్చిన బియ్యం పెడుతున్నాం.మాకే సంబంధం అంటూ ఎదురు సమాధానం చెప్పారు. పాఠశాలలో 330 మంది విద్యార్థులు ఉన్నారు. అన్నంలో పురుగులు రావడంతో తినకుండా వెళ్లిపోయారు. తమకు వచ్చిన బియ్యాన్ని మేము వండామని, తమ తప్పేం లేదని మధ్యాహ్న భోజన నిర్వాహకుడు రమేష్ తెలిపారు.

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సడ్	220
		లైవ్	180
స్కిన్‌లెస్	260	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	73,600	వెండి (కిలో)	94,000
22 క్యారెట్స్	67,845	– నిజామాబాద్ బిజినెస్	

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	40	60	గాజరుగడ్డ	30	50
బెండకాయ	40	60	పచ్చిమిర్చి	50	75
బీరకాయ	40	60	దోసకాయ	20	40
దొండకాయ	15	30	ఆలుగడ్డ	30	50
బీర్నీసుకాయ	80	100	గోబిగడ్డ	30	50
కాకరకాయ	50	75	గోబిపువ్వు	30	50
వంకాయ	10	10	బీట్‌రూట్	20	40
పాలకూర	30	50	కరివేపాకు	40	60
మెంతికూర	50	75	చామగడ్డ	35	50
కొత్తిమీర	20	40	గోరుచిక్కుడు	50	70
పుదీనా	80	120	చిక్కుడుకాయ	50	70
క్యాప్సికం	50	75			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	భారతీయుడు-2 (తెలుగు)-9.00, 12.30, 4.00, 7.25, 10.50
స్క్రీన్-2	కల్కి-2898 ఏడీ(తెలుగు) -12.30
స్క్రీన్-3	కల్కి-2898 ఏడీ(తెలుగు) -10.30, 3.20 ,7.00, 10.40

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	కల్కి-2898 ఏడీ (3డీ తెలుగు)- 11.00, 6.30; కల్కి-2898 ఏడీ(హిందీ)-2.45,10.15
స్క్రీన్-2	భారతీయుడు-2 (తెలుగు) - 11.15, 3.00, 6.45, 10.30
స్క్రీన్-3	కిల్(హిందీ) -12.15, 2.45, 9.00; భారతీయుడు - 2 (తెలుగు)- 5.15
స్క్రీన్ -4	సరఫరా (హిందీ) - 12.20, 3.40, 7.00, 10.20
దేవి	భారతీయుడు-2 (తెలుగు)
నటరాజ్	భారతీయుడు-2 (తెలుగు)
విజయ్	కల్కి-2898 ఏడీ(తెలుగు)

షాపింగ్ మాల్స్ తనిఖీ

నిజామాబాద్‌నాగారం: నగరంలోని చెన్నై, సౌత్ ఇండియా షాపింగ్‌మాల్స్‌లో డిప్యూటీ కమిషనర్ ఆర్వో నరేందర్ ఆధ్వర్యంలో శుక్రవారం తనిఖీలు చేపట్టారు. ట్రేడ్ లైసెన్సు తక్కువ కట్టడంపై ఆరా తీశారు. ఉన్న స్థలానికి కంటే ఎక్కువ ప్రదేశం వినియోగిస్తున్నందున ఎక్కువగా ట్రేడ్ లైసెన్స్ ఫీజు చెల్లించాలని షాపింగ్ మాల్స్ యజమానులకు సూచించారు. ఆర్ఐలు క్రాంతి, రమేష్, అశోక్, శ్రీను, సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో రోగుల నుంచి డబ్బుల డిమాండ్

- అధికారులకు ఫిర్యాదు చేసిన బాధితులు

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో రోగుల నుంచి డబ్బులు డిమాండ్ చేసిన విషయం వెలుగులోకి వచ్చింది. డబ్బులు ఇస్తేనే వీల్ చైర్లు ఇస్తామని సిబ్బంది చెబుతున్నారని జీజీహెచ్ అధికారులకు నగరంలోని 31వ డివిజన్ కార్పొరేటర్ రజియా సుల్తానా కుమారుడు మునావర్ అలీ శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ నెల 10న, ధర్మారం గ్రామానికి చెందిన షాదుల్లా అనే రోగి విషయంలో సిబ్బంది రూ.200 ఇస్తేనే వీల్ చైర్ ఇస్తామని చెప్పారన్నారు. ఇదే విషయం గురించి ఫిర్యాదు చేశారు.

దాశరథి జయంతి సభను జయప్రదం చేయండి



కరపత్రాలను విడుదల చేస్తున్న కవులు

నిజామాబాద్‌నాగారం: ప్రజాకవి దాశరథి కృష్ణమాచార్య 99వ జయంతి సభలు ఈ నెల 21న ఆదివారం నగరంలోని టీఎన్జీవోస్ భవన్‌లో నిర్వహిస్తున్నట్లు దాశరథి కృష్ణమాచార్య జయంతి నిర్వహణ కమిటీ కన్వీనర్ సిర్ప లింగయ్య తెలిపారు. శుక్రవారం నాందేవ్‌వాడలోని మల్లు స్వరాజ్యం ట్రస్ట్ భవన్‌లో ఆయన మాట్లాడారు. ప్రజా కవి దాశరథి తెలంగాణ ప్రజల హృదయాల్లో పదిలంగా ఉన్నారన్నారు. ఓ నిజాము పిశాచమా, కానరాదు నిన్ను పోలిన రాజు మాకెన్నడేని.. తీగలను తెంపి అగ్నిలో దింపినావు. నా తెలంగాణ కోటి రతనాల వీణ అంటూ తెలంగాణ సమాజ అస్తిత్వాన్ని ఎలుగెత్తి చాటిన మహాకవి అని కొనియాడారు. ప్రజావాగ్గేయకారుడు, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న ముఖ్య అతిథిగా హాజరవుతున్నారన్నారు. సమావేశంలో దారం గంగాధర్, దాసు, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలను నియంత్రించాలి



నిజామాబాద్ అర్బన్: నగరంలో గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలను నియంత్రించాలని అదనపు పోలీస్ కమిషనర్‌కు శుక్రవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్క గణేష్ మాట్లాడారు. గంజాయి ఇతర మాదక ద్రవ్యాలకు విద్యార్థులు, యువత అలవాటు పడుతున్నారని అన్నారు. ఇందుకు డ్రగ్స్ విరివిగా దొరకడమే కారణమని చెప్పారు. నగరంలో విద్యాసంస్థలు దాని చుట్టుపక్కల చిన్నచిన్న షాపుల్లో మాదక ద్రవ్యాలు అమ్ముతూ విద్యార్థుల్ని యువతను బానిసలను చేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మాదక ద్రవ్యాలను నియంత్రించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలి



అభివాదం చేస్తున్న నాయకులు

నిజామాబాద్‌అర్బన్: విద్య కాషాయీకరణకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహిస్తామని ఆలిండియా స్టూడెంట్ అసోసియేషన్(ఐసా)జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, బిహార్ ఎమ్మెల్యే సందీప్ సౌరవ్ అన్నారు. నగరంలోని బస్వా గార్డెన్‌లో రెండు రోజుల పాటు జరుగుతున్న ఐసా సమావేశాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తెలంగాణ విద్యార్థి గర్జన పేరిట సభ, సంఘం జిల్లా కార్యదర్శి జ్వాల అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథులుగా ఐసా జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రసెన్‌జిత్, ఎమ్మెల్యే సందీప్ హాజరై మాట్లాడారు. నిరుపేద విద్యార్థులకు విద్యను దూరం చేస్తున్నారని అన్నారు. మనువాద భావజాలాన్ని పాఠ్యాంశాలుగా చేర్చుతున్నారని తెలిపారు. విద్యార్థి అమరవీరులకు రెండు నిమిషాలు మౌనం పాటించారు. వినయక నగర్ చౌరస్తా నుంచి బస్వా గార్డెన్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి మామిండ్ల రమేష్ రాజా, ఐసా రాష్ట్ర నాయకులు కిరణ్ కుమార్, అల్లి సాగర్, విద్యార్థులు పాల్గొన్నారు.